ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అల్లూరి జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను, జీవన్ కృష్ణ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లను శనివారం పాడేరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తిరుపతిలో నిర్వహిస్తున్న ఈ రాష్ట్ర మహాసభలకు విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కార్మికులకు నష్టం చేకూర్చే..

లేబర్ కోడ్స్‌పై నిరసనల వెల్లువ

-సిఐటియు ఆధ్వర్యాన ప్రతుల దహనం

అరకులోయలో లేబర్‌కోడ్స్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

రాజవొమ్మంగిలో నిరసన చేపడుతున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నాలుగు లేబర్ కోడ్ల అమలుకు నిరసనగా శనివారం అరకు అరకులోయ మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు జిఓ పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కొత్త లేబర్ కోడ్లు కార్పొరేట్లకు లాభం చేకూర్చేలా ఉన్నాయన్నారు. సంఘం పెట్టుకునే హక్కులు, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత వంటి మౌలిక హక్కులను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ కోడ్లు నిర్వీర్యం చేస్తున్నాయని ఆయన విమర్శించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం, ప్రతిపక్ష వైసీపి కలిసి కార్పొరేట్లకు మద్దతు ఇస్తున్నాయని దుయ్యబట్టారు. భవిష్యత్తులో ఈ లేబర్ కోడ్ల రద్దు కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దాడి రాజు, అప్పలరాజు, జిసిసి సోప్ యూనిట్ నాయకుడు సత్యారావు, ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు రామారావు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లు నోటిఫై చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం స్థానిక అల్లూరి జంక్షన్ వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లేబర్ కోడ్‌లను రంపచోడవరం సిఐటియూ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిఐటియు జిల్లా నాయకులు పి.రామరాజు, టి.శ్రీను అన్నారు. లేబర్‌కోడ్లను నోటిఫై చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాజవొమ్మంగిలో నిరసన తెలిపారు. నోటిఫై చేసిన ఉత్తర్వుల కాపీలను దగ్ధం చేశారు. సిఐటియు నేతలు రామరాజు, శ్రీను, వెంకటలక్ష్మి, మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులను కాపాడటానికి మాత్రమే బిజెపి ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శిం చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ల ప్రయోజనం కోసం 4 లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు. లేబర్‌కోడ్‌ల రద్దుకు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ నెల 26న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాల్లో కార్మికులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి, ఆశ, విఒఎ, భవననిర్మాణ, పంచాయతీరంగ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించి కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ అమలుకు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో వాటిని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా లేబర్ కోడ్స్ జీవో ప్రతులను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికులు చేసిన సార్వత్రిక సమ్మెలను, నిరసనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడేందుకే కొత్త లేబర్ కోడ్లను తెచ్చిందని విమర్శించారు. ఇప్పటివరకు 100 మంది పైగా కార్మికులు ఉన్న కంపెనీలో లే-ఆఫ్‌కు, లాకౌట్‌కు ప్రభుత్వ అనుమతి ఉండాలని, కాని కొత్త కోడ్ల ప్రకారం ఈ పరిమితిని 300 మంది కార్మికులకు పెంచడం కార్మిక వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. ఈ లేబర్ కోడ్స్‌తో ఉద్యోగ భద్రత, జీతభత్యాలు, కార్మిక హక్కులకు తీవ్రమైన ముప్పు వాటిల్లనుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఏల సంఘం మండల నాయకులు కళ్యాణం, కృపారావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు రాశి, శిరీష, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ, ఆసుపత్రి శానిటేషన్ కార్మికులు ఈశ్వరరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో లేబర్‌కోడ్స్ ప్రతులను చూపుతున్న నాయకులు

ఏజెన్సీలో భయం..భయం..

- నేడు మావోయిస్టు పార్టీ నిరసన దినం
- పోలీసులు అప్రమత్తం..
- ఎఒబిలో యుద్ధ వాతావరణం
- పలు బస్సు సర్వీసులు రద్దు

ప్రజాశక్తి-సీలేరు: మారేడుమిల్లి అటవీప్రాంతంలో మావోయిస్టులకు పోలీసులకు ఇటీవల జరిగిన ఎదురుకాల్పుల్లో కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మాతో పాటు ఆయన భార్య రాజేతో సహా 15 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌కు గురి కావడంతో మావోయిస్టుల కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ నిరసన దినం పాటించేందుకు పిలుపునివ్వడంతో ఎఒబి సరిహద్దుల్లో యుద్ధవాతావరణం నెలకొంది. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు కంచుకోటగా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర పోలీసు బలగాలను మొహరించి విస్తతంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టి అడవిని జల్లెడ పడుతున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అణువణువునా గాలింపు చర్యలు చేపడుతూ భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీగా నష్టపోయిన మావోయిస్టులు చెలరేగి ప్రభుత్వ ఆస్తులతో పాటు పోలీసులకు భారీ నష్టం కలిగించే ముప్పు ఉందని ఇంటెలిజెన్సీ వర్గాలు ఇప్పటికే పోలీసులకు హెచ్చరికలు జారి చేసి అప్రమత్తంచేశాయి. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు సిఆర్‌పిఎఫ్ అవుట్ పోస్టుల వద్ద అదనపు బలగాలను మొహరించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. చత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి మావోయిస్టులు సురక్షితమైన ప్రదేశంగా ఎఒబిని ఎంచుకుని తలదాచుకోవచ్చునని పోలీసులు భావించి ఆ దిశగా గాలింపు చర్యలు చేపడుతూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, రంపచోడవరం మన్యంలో కేంద్ర బలగాలు గ్రేహౌండ్స్ స్పెషల్ పార్టీ రంగంలో దింపి అణువణువునా గాలింపు చర్యలు చేపడుతూ మావోయిస్టుల ఆచూకీ కోసం ఆపరేషన్ ముమ్మరం చేశారు.

టెన్షన్ వాతావరణం

మావోయిస్టు పార్టీ నిరసన దినం పాటించేందుకు పిలుపునివ్వడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. చత్తీస్‌గడ్, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో మావోయిస్టులు ఎటువంటి విధ్వంసాలకు పాల్పడతారోఅని కంటిమీద కునుకు లేకుండా గాలింపు చర్యలు చేపడుతున్నారు. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను వారి ఆధీనంలో తీసుకుని పోలీసులు రాత్రీ, పగలు ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

ఎఒబిలో వణుకుతున్న గిరిజనులు:

ఆంధ్రా ఒరిస్సా సరిహద్దుల్లో ఒక్కసారిగా వందల సంఖ్యలో పోలీసులను మోహరించి తనిఖీలు నిర్వహిస్తుండడంతో గిరిజనులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కొద్ది రోజులుగా నిశ్శబ్దంగా ఉన్న ఎఒబి పోలీసులు తనిఖీలు ముమ్మరం చేయడంతో ఎటువంటి ఉపద్రవం వస్తుందోనని గిరిజనులు అయోమయానికి గురవుతూ భయాందోళన చెందుతున్నారు.

సీలేరులో ముమ్మర తనిఖీలు:

జీకే వీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మావోయిస్టు కదిలికలపై నిఘా పెట్టారు. ఆంధ్ర వలస సరిహద్దు నుంచి వచ్చే పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచిపెట్టారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన గాలికొండ, గుమ్మిరేవులు, గుర్తేడు తదితర ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి గాలింపు చర్యలు చేపడుతున్నారు. పోలీస్ ఇన్ ఫార్మర్లతో మావోయిస్టు కదిలికలపై నిఘా పెట్టారు. మావోయిస్టు కేంద్ర కమిటీ భారత్ బంద్‌కు పిలుపునివ్వడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

నైట్ బస్ సర్వీసులు రద్దు:

మావోయిస్టు కేంద్ర కమిటీ భారత్ బంద్‌కు పిలుపునివ్వడంతో విశాఖ వయా నర్సీపట్నం చింతపల్లి సీలేరు మీదగా వెళ్లే విశాఖ భద్రాచలం నైట్ సర్వీస్ బస్‌తో పాటు విశాఖ సీలేరు నైట్‌హాల్ట్ బస్ సర్వీసులు శని ఆదివారాల్లో రద్దు చేసినట్లు విశాఖ డిపో మేనేజర్ మాధురి ప్రకటించారు.

వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

అంతర్రాష్ట్ర రహదారి పనులు

తక్షణమే ప్రారంభించాలి

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు నుంచి పాలగెడ్డ వరకు అంతర్రాష్ట్ర రహదారి పనులు తక్షణమే ప్రారంభించాలని అల్లూరి జిల్లా కాంగ్రెస్ డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలగా శిధిలావస్థకు చేరుకున్న అంతర్రాష్ట్ర రహదారి మరమ్మత్తులు నిమిత్తం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సంబంధిత కాంట్రాక్టర్లకు పనులు అప్పగించినప్పటికీ పనులు జరగడం లేదన్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో పనులు ప్రారంభించి తర్వాత వదిలేసారని ఆరోపించారు. మార్చిలో ఇదే రహదారిలో రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంగతి తెలిసిందేనని గుర్తు చేశారు. అక్టోబర్‌లో ఇదే రహదారిలో పెద్ద గోతిలో టూరిస్ట్ బస్సు పడి ప్రమాదం నుంచి బయట పడినప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు స్పందించకపోవడం పలువురిని విస్మయానికి గురి చేసిందని, ఆర్ అండ్ బి అధికారుల ధోరణి చూస్తుంటే పెద్ద ప్రమాదాలు జరిగి భారీ ఎత్తున ప్రాణనష్టం జరిగితే గానీ రహదారి పనులు చేపట్టరేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు స్పందించి వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

గ్రామకంఠం స్థలాలకు హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి- జీకేవీధి : మండలంలోని రింతాడలో గ్రామకంఠం స్థలం సర్వే నెంబర్ 78-1 విస్తీర్ణం 4.32 సెంట్లు ఉండగా అందులో కొంత ఆక్రమణకు గురవుతోందని గతంలో గ్రామస్తులు కలెక్టర్‌కి ఫిర్యాదు చేయడంతో స్పందించి శనివారం మండల సర్వేయర్లు, ఆర్ఐ లు వచ్చి గ్రామకంఠం భూమి మొత్తం సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. గ్రామకంఠం ఆక్రమిస్తే శిక్షార్హులు అని హెచ్చరిక బోర్డులు పెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి, మండల ఆర్ ఐ బాలమజ్జి, మండల సర్వేయర్ శ్రీను, ఉపసర్పంచ్ పాల్గొన్నారు.

స్థానిక యువతకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని అల్లూరి యూత్ అధ్యక్షుడు కే.సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ జలపాతంను ఐటిడిఏ అధీనంలోకి తీసుకొని స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పారన్నారు. అరకొరగా కొంత మందికి ఉపాధి కల్పించి చేతులు దులుపుకున్నారన్నారు. వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఏం నవ సూర్య, నాయకులు పాల్గొన్నారు.

మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి

అటవీశాఖ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-చింతపల్లి : సీలేరు రేంజ్‌లో విధులు నిర్వహిస్తూ గత ఏడాది అకాలమరణం పొందిన అసిస్టెంట్ రేంజ్ అధికారి బొండా తిరుపతిరావు కుటుంబానికి అటవీ శాఖ నుండి ఆర్థిక భరోసా లభించింది. చింతపల్లి అటవీ శాఖ కార్యాలయంలో చింతపల్లి డివిజన్ అటవీ అధికారి వైవి.నరసింహారావు చేతుల మీదుగా తిరుపతిరావు భార్య బొండా లక్ష్మికి శనివారం రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ తిరుపతిరావు పనిచేసిన తీరు శాఖకు ఆదర్శమని, ఆయన సేవలను అటవీ శాఖ ఎప్పటికీ మరిచిపోదని తెలిపారు. అకాలమరణంతో సమస్యల్లో ఉన్న కుటుంబానికి అటవీ శాఖ తరపున మరింత సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఎస్.వెంకటరావు, సిహెచ్.సింహాచలం పడాల్, బీట్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

వరండాలో చదువులు

-నిలిచిన పాఠశాల భవనం పనులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని లుంగపర్తి స్కూల్ కాంప్లెక్స్ వాలసి పంచాయతీ పరిధి ఊటగెడ్డ ప్రాథమిక ప్రైమరీ పాఠశాల విద్యార్థులు ఓ ఇంటి ఇరుకు వరండాల్ లో చదువు కొవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. నిలిచిపోయిన పాఠశాల పనులు తక్షణమే పూర్తి చేయాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. 15 ఏళ్ల క్రితం పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా అప్పటి ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు సన్ సైడ్ రూఫు లెవెల్ వరకు పనులు చేపట్టి నిధులు డ్రా చేసి పనులు వదిలివేశారు. దీంతో ఈ పాఠశాలలో చదివుతున్న విద్యార్థులకు ఎండాకాలంలో చెట్లు కింద, వర్షాకాలంలో ఇంటి వరండాలో చదువు కోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుత అధికార కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తుందే తప్పా విద్యారంగానికి ఎటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. నిలిచిన పాఠశాల పనులు పున:ప్రారం భించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వరండాలో చదువుతున్న విద్యార్థులు

ఆశ్రమ పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

వసతిగృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: వసతిగృహాలను సిబ్బంది పరిశుభ్రంగా ఉంచాలని ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు అన్నారు. శనివారం ఎంపిడిఒ స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వంటశాల, వసతిగృహం పరిసరాలను పరిశీలించారు. చెత్త పేరుకుపోకుండా చూడాలని, మురికినీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెనూ ప్రకారం అందజేయాలన్నారు. విద్యార్థులకు వేడినీరు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మండల బిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా నానాజీ

నానాజీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండల టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా తనను టిడిపి అధిష్టానం నియమించిందని కార్యదర్శి నానాజీ శనివారం తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశం ఇచ్చిన రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ఎం.విజయభాస్కర్, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దంతులూరి శివరామచంద్రరాజు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివద్ధికి కషి చేస్తానన్నారు. నానాజీ ఎంపికపై టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు చిన్ని ఎంపిక

జి.చిన్ని

ప్రజాశక్తి-సీలేరు: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు జీకేవీధి మండలం సీలేరు హైస్కూల్ అసిస్టెంట్ (పిడి) జి.చిన్ని ఎంపికయ్యారు. ఈ నెల 21న విజయవాడలో జరిగిన ఇండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో చిన్ని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఖోఖో జట్టు తరపున న్యూఢిల్లీలో జరగనున్న పోటీల్లో పాల్గొనున్నారు. కొద్దిరోజులు కిందట స్కూల్ అసిస్టెంట్ పీడీగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో చిన్ని పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చారని హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, సిబ్బంది చిన్నిని అభినందించారు.

సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

యండపల్లిలో వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం మండలం మర్రిపాలెం యండపల్లి పంచాయతీలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి కోటి సంతకాల సేకరణ ప్రజాఉద్యమ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఎంపిపి పల్లాల కృష్ణారెడ్డి అన్నారు. మండల అధ్యక్షులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం పేదల పొట్టలు కొట్టే విధంగా ముందుకు అడుగులు వేస్తోందని దానికి ఉదాహరణ ఈ ప్రైవేటీకరణ అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మర్రిపాలెం, సూరంపాలెం, యండపల్లి సర్పంచ్‌లు వెంకటేశ్వర్లుదొర శివదొర, రామలక్ష్మి మాజీ సర్పంచ్ పీరు బాల్రెడ్డి పార్టీ నాయకులు జడేరుశివ తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ బృందం సీలేరులో పర్యటన

మెయిన్‌డ్యామ్ వద్ద పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -సీలేరు: కాంప్లెక్స్ పరిధి సీలేరు జలాశయం నీటి నిలువలు రియల్ టైం గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చేరే విధంగా అవసరమైన పరికరాలను అమర్చేందుకు జలవనరుల శాఖా బృందం శనివారం సీలేరులో విస్తృతంగా పర్యటించింది. ఈ మేరకు ఎపి జెన్కో అధికారులతో కలిసి సీలేరు జలాశయం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రియల్ టైం గవర్నెన్స్‌కు అనుసంధానం చేస్తూ సీలేరు జలాశయం నీటిమట్టం వివరాలను గంట గంటకు తెలుసుకునేందుకు ఈ పరికరాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై జల వనరుల శాఖ ఎపి జెన్కో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎపి జెన్కో ఎస్సీ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి ఎఇఇ అనుదీపు ఇరిగేషన్ ఎఇఇ రఘు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో అంబులెన్స్ లేక అవస్థలు

ప్రజాశక్తి- జికె వీధి : మండలంలోని ఆర్‌వినగర్ పిహెచ్‌సిలో అంబులెన్స్ మొరాయించడంతో రోగులను అత్యవసర పరిస్థితిలో మెరుగైన వైద్యం కోసం తరలించాలంటే ఇబ్బంది పడుతున్నారని వైసిపి నాయకుడు అరికట్ల ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త అంబులెన్స్ మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరినప్పటికీ పిహెచ్‌సికి అంబులెన్స్ మంజూరు కాలేదు. ఇప్పటికైనా పిహెచ్‌సికి అంబులెన్స్ మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్

ప్రమాణాలు నిలుపుకుంటేనే ప్రగతి

- ఎయు విసి ఆచార్య జిపి రాజశేఖర్

ప్రజాశక్తి- విశాఖపట్నం : ప్రమాణాలను నిర్ధారించడం, అనుసరించడం, సమర్ధవంతంగా అమలు చేయడం ఎంతో అవసరమని, వాటిని నిలుపుకుంటేనే ప్రగతి సాధ్యపడుతుందని ఎయు ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ చెప్పారు. ఎయు కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో శుక్రవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆభరణాలకు సైతం ప్రమాణాలను నిర్ధారించి, అమలు చేస్తున్న విధానాన్ని వివరించారు. సాంకేతికత అనుసంధానిత సమాజంలో మనం జీవనం సాగిస్తున్నామని, మనం వినియోగించే వస్తువులలో ప్రమాణాలు లేని వాటిని గుర్తించి, వాటికి ప్రమాణాలను సిద్ధం చేసే విధంగా యువత కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి చెందుతున్న వైద్య రంగానికి అవసరమైన ఉపకరణాలలో ప్రమాణాలు పాటించడం ఎంతో అవసరమన్నారు. ఆయా రంగాలలో నిష్ణాతులను ఆహ్వానించి, పరిశోధకులు స్ఫూర్తిని, మార్గనిర్దేశాన్నిచూపే విధంగా కార్యక్రమాలు చేయాలన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య పి.కింగ్ మాట్లాడుతూ, విభిన్న వ్యవస్థలలో ప్రమాణాలను రూపొందించి, అమలు చేసే వ్యవస్థగా బిఐఎస్ పనిచేస్తోందన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించాలంటే ఖచ్చితంగా ప్రమాణాలను అనుసరించడం అవసరమన్నారు. రెగ్యులేటరీ వ్యవస్థలు సమర్ధవంతంగా పనిచేయాలని సూచించారు.

ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన పెంచడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. సదస్సు సమన్వయకర్త, విభాగాధిపతి ఆచార్య వి.శ్రీదేవి మాట్లాడుతూ అత్యుత్తమ ప్రగతికి ప్రమాణాలే పునాదులుగా నిలుస్తాయన్నారు. పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలను విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం ఆచార్య పి.వెంకటరావు వందన సమర్పణతో ముగిసింది.

తొలిరోజు నుంచే కెరియర్ ప్లానింగ్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశ్వవిద్యాలయంలో చేరిన తొలిరోజు నుంచి విద్యార్థులు తమ కెరియర్ ప్లానింగ్ చేసుకోవాలని ఎయు విసి ఆచార్య జిపి రాజశేఖర్ అన్నారు. ఎయు సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు రెండేళ్ల కాలాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా ప్రతి విద్యార్థీ కరికులమ్‌ను తెలుసుకోవడం, సబ్జెక్టును అభ్యసించిన తరువాత తనకు లభించే జ్ఞానం, ఫలితాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. హాస్టల్ మెస్‌ల నిర్వహణలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని స్వాగతిస్తున్నామని, వివిధ కమిటీలలో వారు చురుకైన భూమిక వహిస్తూ నాణ్యత, పరిశుభ్రత మరింత పెంచే విధంగా తమ విలువైన సూచనలను అందించాలన్నారు. విద్యార్థులను క్రీడా సాంస్కృతిక అంశాలలో భాగం చేసే విధంగా స్టూడెంట్స్ వెల్ఫేర్ కౌన్సిల్, వసతుల కల్పన దిశగా టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేసామని, వీటితో కలసి పనిచేయాలని విద్యార్థులకు తెలిపారు.

పరీక్షలు రాసే సమయంలో నైతిక విలువలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనైతిక చర్యలకు పాల్పడి కెరియర్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. పరీక్షల నిర్వహణలో విజిలెన్స్‌ను పెంచామన్నారు. శతాబ్ది సంవత్సరంలో వర్సిటీలో ప్రవేశం పొందిన ప్రత్యేక బ్యాచ్‌గా మీరంతా నిలచి పోతారని చెబుతూ విద్యర్థులను అభినందించారు.

విద్యార్థులు తమ పూర్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తూ, ఆలోచనలను వికసింప చేయాలని సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎంవిఆర్ రాజు అన్నారు. విద్యార్థులకు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరిస్తూ, వారికి దిశానిర్దేశం చేసారు. కార్యక్రమంలో భాగంగా విభాగాధిపతులు, ప్రథమ సంవత్సరం విద్యార్థులు తమ ఆలోచనలను పంచుకున్నారు.

పిహెచ్‌సిలకు అభివృద్ధి నిధులు ఏవీ?

-ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి- హుకుంపేట: ఏజెన్సీ ప్రాంతంలో ఆరోగ్య సేవలు దుర్భరంగా మారాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ప్రభుత్వంను కోరారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో శనివారం బృందంతో పాటు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలోని పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పీహెచ్‌సిల అభివృద్ధి నిధులు ప్రభుత్వం నిలిపి వేయడంతో ఆసుపత్రుల పనితీరు తీవ్రంగా దెబ్బతిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 70:30 నిష్పత్తిలో, ఏటా ఒక్కో పీహెచ్‌సికి రూ.1,70,000 మెంటినెన్స్ నిధులు విడుదల చేసి హాస్పటల్లో ఖర్చు చేసి ఉండేదని గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ నిధులు ఆగిపోయాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌సిల 18 అంబులెన్స్‌లు ప్రస్తుతం మరమ్మతుకు గురయ్యాయన్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించటం కష్టంగా మారుతుందన్నారు. అంబులెన్స్‌ల మరమ్మతుకు అత్యవసర నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వంను కోరారు.పాడేరు మెడికల్ కాలేజీలో 2025, 2026 సంవత్సరాలకు 50 ఎంబీబీఎస్ సీట్లు కోల్పోవడం ప్రభుత్వ వైఫల్యమని సురేంద్ర విమర్శించారు. వెంటనే చర్యలు తీసుకుని సీట్లను తిరిగి పొందాలన్నారు. ఆదివాసీ ప్రాంత ఆరోగ్య సేవల విషయంలో

మాట్లాడుతున్న సురేంద్ర

ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం, వివక్ష చూపుతోందని ఆయన మండిపడ్డారు. ప్రైవేటీకరణపై ఆసక్తి చూపుతూ పాడేరు మెడికల్ కాలేజీ సీట్లు, పీహెచ్‌సి ల అభివృద్ధి, అంబులెన్స్‌ల అందుబాటులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.చిన్నం నాయుడు, హుకుంపేట మండల కార్యదర్శి టీ. కృష్ణారావు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి ప్రభావిత పిల్లల సమస్యల పరిష్కారానికి చర్యలు

మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పి.యం.ఆర్.సి కార్యాలయం సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లల అవసరాల పై వివిధ శాఖల సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా లేప్రసి ఎయిడ్స్ మరియు టీబి అధికారి ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లలు, వారి కుటుంభ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లలు అవసరాలు, ఎదుర్కొటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కార చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రభావిత రోగులు తీసుకుంటున్న జాగ్రత్తలు, చర్యలను అడిగి తెలుసుకున్నారు. హెచ్.ఐ.వి. ప్రభావిత పిల్లలు ఏ.ఆర్.టి మందులను సక్రమంగా తీసుకుంటూ, పౌష్టికాహారం తీసుకోవాలని తద్వారా ఆరోగ్యం మేరుగు పరుచుకోవచ్చని అన్నారు. జిల్లా పరిధిలో ఉన్న మండలములలో హెచ్.ఐ.వి.తో జీవిస్తున్న, హెచ్.ఐ.వి. ప్రభావితమైన 14 నుండి 25 సంవత్సరాల వయస్సు గల పిల్లల సమస్యలు, అవసరాలు గుర్తింపు, పరిష్కారానికి అవసరమైన చర్యలను జిల్లా స్థాయి హెచ్.ఐ.వి./ఎయిడ్స్ ఎస్.వి.డి.ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ, నెట్ వర్క్ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేసి అవగాహన కార్యాక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి హెచ్.ఐ.వి./ఎయిడ్స్ కార్యాక్ర మాలపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ బాలకృష్ణ, ప్రాథమిక విద్యా అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్, ఉన్నత విద్యా నోడల్ ఆఫీసర్ గౌరీ శంకర, జిల్లా డిప్యూటి డెమో పి.సింహాచలం, జిల్లా ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, పాడేరు ఐ.సి.డి.ఎస్ సి.డి.పి.ఓ శారద దేవి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కె.రామచందర్, డి.ఎం.డి.ఒ.ఎస్ చిరంజీవి, హెచ్.ఐ.వి./ఎయిడ్స్ ఎస్.వి.డి.ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వృక్ష శాస్త్ర విభాగంలో జాతీయ వర్క్ షాప్

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 16, 17 తేదీలలో నిర్వహించే జాతీయ వర్క్ షాప్‌నకు సంబంధించిన పోస్టర్‌ను ఏయు ఉపకులపతి ఆచార్య జిపి రాజశేఖర్ శనివారం విడుదల చేశారు. పర్యావరణ- అటవీ- క్లైమేట్ చేంజ్ మంత్రిత్వ శాఖ, బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ రెండు రోజుల వర్క్ షాప్ కు సహకారం అందిస్తున్నాయి. ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిజర్వింగ్ ద ప్లానెట్స్ గ్రీన్ హెరిటేజ్ – ద రోల్ ఆఫ్ ప్లాంట్ బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అంశంపై వర్క్ షాప్ నిర్వహిస్తున్నారు. పోస్టర్ ఆవిష్కరణలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎంవిఆర్ రాజు, విభాగాధిపతి ఆచార్య డి.సంధ్యా దీపిక, వర్క్ షాప్ సమన్వయకర్త ఆచార్య ఎస్‌బి.పడాల్, విభాగ ఆచార్యులు ఆచార్య పికె.రత్నకుమార్, డాక్టర్ పి.బలరామస్వామి యాదవ్, డాక్టర్ ఎస్‌వివిఎస్.దొర, డాక్టర్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

బెన్నవరం సర్పంచ్ భర్త రమణ మృతి

ప్రజాశక్తి- చింతపల్లి: చింతపల్లి మండలం బెన్నవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ బచ్చేల సన్యాసమ్మ భర్త, గ్రామ అభివద్ధికి గురువుగా పేరుపొందిన బచ్చేల రమణ (65) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రమణ శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లోనే చనిపోయారు. 1985 నుండి 2019 వరకు సిపిఐ మండల కార్యదర్శిగా పనిచేసిన రమణ పని చేశారు. రమణ స్ఫూర్తితోనే 2020లో ఆయన భార్య సన్యాసమ్మ స్వాతంత్ర అభ్యర్థిగా సర్పంచ్‌గా విజయం సాధించి, అనంతరం టీడీపీలో చేశారు. రమణ మృతదేహాన్ని వందలాది మంది ప్రజలు, బంధువులు, రాజకీయ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయితీ అమలగుడ, బీజుమరవలస, జాంగూడ, దౌడువలస మారుమూల గ్రామాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని వైసీపీ మండల కార్యదర్శి కె.విజయదశమి డిమాండ్ చేశారు. శనివారం అయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ గ్రామాల్లో వీధి దీపాలు లేక పోవడంతో గిరిజనులు రాత్రుల్లో ఇరుగుపొరుగు గృహాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి వీధిదీపాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

మధ్య తరగతి మందహాసం పుస్తక పరిచయ సభ

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ రచయిత కీర్తిశేషులు బెహరా వెంకట సుబ్బారావు రచించిన సర్వ సభ్య రచనల సంపుటి మధ్య తరగతి మందహాసం పుస్తక పరిచయ సభ ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. సాహితీ వేత్తల సమక్షంలో జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా రైటర్స్ అకాడమి చైర్మన్, లీడర్ పత్రికాధిపతి వివి.రమణమూర్తి హాజరై బెహరా సత్యనారాయణ మూర్తిని, ఈ పుస్తకాన్ని సమీక్షించిన ముగ్గురు ఉపన్యాసకులును అభినందించారు. మానవతా విలువలు గల కథలు ఉండటం గొప్ప విషయమన్నారు. 30 సంవత్సరాల తరువాత దీనిని పుస్తకరూపంలోకి వెంకటసుబ్బారావు తీసుకొచ్చి బతికించారని కొనియాడారు. మధ్య తరగతి జీవితం ఎలా ఉంటుందో ప్రతి కథలో దాగి ఉందని, ఆ విషయాన్ని సమీక్షకులు చక్కగా చెప్పారన్నారు. మధ్య తరగతి ప్రజలు నిజాయతీగా ఉంటారని చెప్పారు. పెళ్లికి సంబంధించిన కథను వినిపించి, అందులో నీతిని సభ ముందుంచారు. వెంకట సుబ్బారావు కుమారుడు బెహరా సత్యనారాయణమూర్తిని సత్కరించారు. బెహరా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, ఈ పుస్తకం విజయనగరంలో ఆవిష్కరణ జరిగిందని, నాన్నకి విశాఖపట్నంతో సంబంధం ఉండటంతో పరిచయం ఇక్కడ చేస్తున్నామని చెప్పారు. నాన్న కథల్లో ఉత్తరాంధ్ర యాస ఉంటుందని, సామాజిక సమస్యల్ని ఎత్తిచూపారని వివరించారు. అరసం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ, 500 పేజీలు పుస్తకంలో 73 కథలు, 2 నవలలు ఉన్నాయని చెప్పారు. డాక్టర్ డివి.సూర్యారావు మాట్లాడుతూ, ఈ పుస్తకంలో మానవీయ విలువలు చాటే కథలున్నాయని, రైల్వేస్టేషన్‌లో జరిగిన కథను, మానవత్వం చాటే కథను వివరించారు. జయంతి ప్రకాష్ శర్మ మాట్లాడుతూ, కథలన్నీ కుటుంబ నేపథ్యంలో ఉన్నాయని వివరించారు. సర్వసిద్ధి హనుమంతరావు పైలాపచీస్ కథను సమీక్షించారు. బసు పోతన సభకు ఆహ్వానం పలికిన సభ కె.సన్యాసిరాజు వందన సమర్పణతో ముగిసింది.

టైప్ పరీక్షలు రెండు రోజులు నిర్వహించాలి

ప్రజాశక్తి- తగరపువలస : రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ద్వారా ఆరు నెలలకు నాలుగు బ్యాచ్‌ల చొప్పున రెండు రోజులు టైప్ రైటింగ్ పరీక్షలు జరిగేవని, జనవరి 2026 నుండి టైప్ పరీక్షలు ఒక్క రోజులో నాలుగు బ్యాచ్‌లు జరుపుటకు తీసుకున్న నిర్ణయం వల్ల విద్యార్థులు ఎన్నో ఇబ్బందులకు గురవుతారని విశాఖపట్నం జిల్లా టైప్ షార్ట్ హ్యాండ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరావు, సెక్రటరీ రమేష్ పేర్కొన్నారు. పాత పద్ధతిలో రెండు రోజులు నాలుగు బ్యాచ్‌ల చొప్పున పరీక్షలు జరపాలని సాంకేతిక విద్యాశాఖ అధికారులను కోరారు.

25లోగా మూడు చక్రాల వాహనాలకు దరఖాస్తు

ప్రజాశక్తి- పద్మనాభం : వికలాంగులు మూడు చంక్రాల వాహనాల కోసం ఈ నెల 25వ తేదీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పద్మనాభం ఎంపిడిఒ కె.రూపేష్ తెలిపారు. 18 నుండి 45 సంవత్సరాలు మధ్య ఉన్న వికలాంగులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సంవతరానికి రూ.3 లక్షల ఆదాయానికి లోబడి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని తెలిపారు. గతంలో ప్రభుత్వం నుంచి లేదా ఏదైనా ప్రైవేటు సంస్థ నుంచి కానీ ఇటువంటి వాహనాలను పొంది ఉండరాదని పేర్కొన్నారు.

సచివాలయంలో నిర్వహిస్తున్న గ్రామసభ

ఉపాధి పనుల నిర్వహణపై గ్రామసభ

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం సచివాలయంలో శనివారం ఉపాధి పనుల నిర్వహణపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ అక్కమ్మ అనివార్య కారణాల వల్ల రాలేకపోయినందున ఉపసర్పంచ్ పరదా వెంకటేశ్వర్లుదొర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధి హామీ జాబ్ కార్డులు 4,5 సంవత్సరాల ముందు మృతి చెందిన వారి జాబితాను డిలీట్ చేయడం, అలాగే వేరొక ఊరికి వలస వెళ్లిపోయిన వారి జాబితాను కూడా డిలీట్ చేయడం వంటి విషయాలను వివరించారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ జాబ్‌కార్డు పొంది ఉపాధి హామీపనులను సద్వినియోగం చేసుకోవాలని మన గంగవరంలో 430 జాబ్‌కార్డులు ఉండగా కనీసం 30 శాతం మంది మాత్రమే ఈ పనిని ఉపయోగించుకుంటున్నారని జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పనిని ఉపయోగించుకోవాలన్నారు. మాజీ ఎంపిపి డాక్టర్ తీగల ప్రభ, మాజీ ఎంపిటిసి కోసు బుల్లియమ్మ, బూత్ కన్వీనర్ సారపు సత్యవేణి , సెక్రటరీ శ్రీనివాస్ ఫీల్డ్‌అసిస్టెంట్ కత్రంచిన్నాలుదొర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన హౌసింగ్ ఇళ్లకు జియో ట్యాగ్ తప్పనిసరి

ప్రజాశక్తి -జికెవీధి : మండలంలోని పిఎం ఆవాస్ 2.0 నూతన గృహాలకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ జియోట్యాగింగ్ సర్వే తప్పకుండా చేయించుకోవాలని రింతాడ పంచాయతీ 2 ఇంజనీరింగ్ అసిస్టెంట్ గడుతూరి సత్యనారాయణ తెలియజేశారు. ఇందులో గృహ యజమాని వివరాలను ఇంటి లొకేషన్‌తో పాటు ఫోటోలను కూడా సేకరిస్తున్నారు. ఇందువల్ల అర్హులు పథకాల ద్వారా లబ్ధిని పొందేందుకు సహకరిస్తుందని, ఈనెల 30వ తేదీ లోపు జియో ట్యాగింగ చేయించుకోవాలని తెలియజేశారు.

శబరిమలై యాత్రకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్ : శబరిమలై యాత్రకు ఆర్టిసి ప్రత్యేక బస్సులను విశాఖ నుంచి నడుపుతోందని ఆర్టిసి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. శనివారం విశాఖపట్నం డిపో నుండి శబరిమలై యాత్రకు మొదటి ప్రత్యేక బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా శబరిమలై యాత్రకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఇప్పటికే దీక్ష చేస్తున్న స్వాములు ఆరు బస్సులు బుక్ చేసుకున్నారని, మిగిలినవారు సంప్రదింపులు చేస్తున్నారని తెలిపారు. భక్తుల కోరిక మేరకు బస్సు రూట్లను బట్టి, బస్సు ధరను నిర్ణయిస్తుందన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి ప్రతివారం కూడా హైదరాబాద్, విజయవాడ మొదలగు ప్రాంతాలకు స్పెషల్ బస్సులు నడుపుతున్నామని తెలిపారు. కార్తీకమాసంలో పంచరామ క్షేత్రదర్శన యాత్రలకు మంచి స్పందన లభించిందని, ధనుర్మాసంలో కూడా పంచవైష్ణవ క్షేత్ర దర్శనానికి కూడా బస్సులు నడుపుతు న్నామన్నారు. దూరప్రాంత ఎసి బస్సుల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని, ఆకస్మిక ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్స్ ఏ విధంగా ప్రయాణికులకు రక్షణ కల్పించాలో నేర్పుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ గంగాధర్, వర్క్ మేనేజర్ అరుణ కుమారి, విశాఖపట్నం డిపో మేనేజర్ మణి మాధురి, అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణ, హిమబిందు, సూపర్‌వైజర్లు, సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సెట్విస్ సిఇఒగా రమ్య

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖపట్టణం సెట్విస్ నూతన సిఇఒగా మెట్ట రమ్య నియమితులయ్యారు. 2016 గ్రూప్ -1 బ్యాచ్‌కు చెందిన ఈమె ఇప్పటి వరకూ విశాఖపట్టణంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. తాజా ఉత్తర్వుల ప్రకారం స్థానిక జెడ్పీ జంక్షన్ సమీపంలో ఉన్న సెట్విస్ కార్యాలయంలో శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి సిఇఒగా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి కె.కవిత అదనపు బాధ్యతలు నిర్వర్తించారు.

గిరి ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యాలు చేరుకోవాలి

జిసిసి వైస్ ఛైర్‌పర్సన్, ఎమ్‌డి కల్పనా కుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :

గిరిజన ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యాల సాధనకు అందరూ కృషి చేయాలని జిసిసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి అన్నారు. గిరిజన సహకార సంస్థ కార్యకలాపాలపై శనివారం ఉదయం బీచ్ రోడ్డులోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కాఫీ, అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, అమ్మకాలపై సమీక్ష నిర్వహించిన ఆమె మిగిలిన లక్ష్యాన్ని తప్పకుండా సాధించాలని అధికారులను ఆదేశించారు. 2025-26 సంవత్సరానికిగాను మొత్తం వార్షిక లక్ష్యం రూ. 62,016.02 లక్షలు కాగా నవంబర్ నెల వరకు జిసిసి రూ.24,048.59 లక్షల పురోగతిని సాధించిందని తెలిపారు. గత సంవత్సరంలో ఇదే కాలానికి సాధించిన రూ.23,478.86 లక్షలతో పోలిస్తే 102 శాతం అధికం కావడం విశేషమన్నారు. మిగిలిన రూ.37,967.43 లక్షల లక్ష్యాన్ని సాధించేందుకు డివిజనల్ సొసైటీ మేనేజర్లు ప్రత్యేక కృషి చేయాలని అమె సూచించారు. గత సంవత్సరంతో పోలిస్తే కొన్ని కీలక విభాగాలలో గణనీయమైన ప్రగతి నమోదైందని, అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు విభాగంలో ఏకంగా 159 శాతం ప్రగతితో రూ.378.43 లక్షల కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. కాఫీ రైతులకు రుణ సాయం విభాగంలో అత్యధికంగా 636 శాతం వృద్ధి నమోదైందన్నారు. ఈ సంవత్సరం రూ.99.85 లక్షల రుణాలు అందించినట్టు తెలిపారు. రుణ వసూళ్లలో 160 శాతం వృద్ధి సాధించి రూ.27.15 లక్షల వసూళ్లు నమోదయ్యాయని వెల్లడించారు. ఎల్‌పిజి గ్యాస్ విక్రయాల విభాగంలో 111 శాతం వృద్ధితో రూ.1761.41 లక్షల విక్రయాలు జరిగాయన్నారు. రోజువారీ అవసరాల అమ్మకాలలో 105 శాతం పురోగతి సాధించామని, పెట్రోల్ బంకులు, సూపర్ బజార్ విక్రయాలు

మాట్లాడుతున్న కల్పనాకుమారి

లక్ష్యానికి దగ్గరగా 97 నుంచి 99 శాతం వరకూ ఉన్నాయని వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని జిసిసి డివిజనల్ మేనేజర్లు, సొసైటీ మేనేజర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి దోహదపడే జిసిసి కార్యకలాపాలను మరింత మెరుగుపరచాలని కల్పనా కుమారి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కాఫీ కొనుగోలు లక్ష్యాలు, ధరలు

ఇదిలా ఉండగా గిరిజన కాఫీ రైతులకు అండగా ఉండేందుకు 2025-26 సంవత్సరానికిగాను 1175 టన్నుల కాఫీ కొనుగోలును లక్ష్యంగా నిర్ణయించారు. రైతులకు మద్దతు ధరలను కూడా ఖరారు చేశారు, అరెబికా పార్చ్‌మెంట్ కాఫీ రకం కిలో రూ.450, అరెబికా చెర్రీ కిలో రూ.270, రోబస్టా చెర్రీ కాఫీ రూ. 170గా నిర్ణయించారు

ఆరోగ్య సేవలందించడంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకం

- రఘు ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్ పండా

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ : ఆరోగ్య సేవలందించడంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకమని రఘ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ పండా పేర్కొన్నారు. 64వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని రఘు ఫార్మశీ కళాశాల విద్యార్థులు నగరంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయం సమీపంలో ఉన్న రఘు క్యాంప్స్ నుంచి గాంధీ విగ్రహం వరకు విద్యార్థులు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రజలకు అవగహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ పండా మాట్లాడుతూ, ప్రతి ఏటా నవంబర్ మూడో వారంలో ఫార్మశీ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్య పరీక్షలు, వ్యాక్సినేషన్, హెల్త్ కాంప్‌ల ద్వారా ఫార్మసిస్ట్‌ల విజ్ఞానం, నైపుణ్యం ప్రజలకు అర్థం అవుతుందన్నారు. ర్యాలీలో డాక్టర్ పద్మజా, డాక్టర్ రమాదేవి పండా శిరిషా, ఎన్‌సిసి కోఆర్డినేటర్ రమణమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మాతృభాషను.. మృత భాష చేస్తారా'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ పాలకులు తెలుగు భాషను, మృతభాషగా మారుస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని తెలుగు దండు అధ్యక్షుడు పరవస్తు సూరి అన్నారు. తెలుగుభాష రక్షణ కోసం తెలుగు దండు ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం చేపట్టిన టిట్టిభ సత్యాగ్రహం శనివారం నాటికి 13 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన పాలకులకు జాతి ఆకాంక్షలు అస్సలు పట్టవన్నారు. మన భాషను, సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రలో భాషకు, సంస్కతికి గానీ ఇసు మంత హాని జరిగితే, ఒక్క రోజులో ప్రభుత్వాలు కూలిపోతాయని, మనం మాత్రం మన భాషకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నించకుండా నిమ్మకు నీరెత్తినట్లు, చోద్యం చూస్తామన్నారు.

అధికారుల నిర్లక్ష్యం... ప్రజలకు శాపం..

సత్యసాయి తాగునీటి పథకం ద్వారా నిలిచిన నీటి సరఫరా

5 మండలాల వాసులకు ఇదే ఆధారం..

తాగునీటి పథకాన్ని మూసివేస్తారన్న భయాందోళన

ప్రజాశక్తి -దేవీపట్నం : భగవాన్ సత్య సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరిజన మైదాన ప్రాంతాలకు గోదావరి తాగునీటిని అందించేందుకు 2006లో సత్యసాయి తాగునీటి సరఫరా ప్రాజెక్టును ఏర్పాటు చేయడం జరిగింది. గిరిజన ప్రాంతాల్లో ఈ నీటిని తాగడం వలన చాలామందికి ఆరోగ్యంగా ఉంటున్నారు. ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. గత 25 రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో ఐదు మండలాల్లో 80 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. లక్షలాది మంది ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే సత్యసాయి ప్రాజెక్టు విషయంలో అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారు. నీటిని శుద్ధి చేసే పటికను తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యం కనబరుస్తున్నా రని ప్రజలు విమర్శిస్తున్నారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామ సమీపంలో గోదావరి నది ఒడ్డున సత్యసాయి మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీతానగరం, దేవీపట్నం, గోకవరం, కోరుకొండ, రాజానగరం మండలాలకు తాగునీటి సరఫరా నిరంతరం జరుగుతుండేది. సత్య సాయి ప్రాజెక్టులో పని చేసే కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వకపోయినా వీరంతా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. గోదావరి నదిలో నీటిని ఎత్తిపోతల ద్వారా తీసుకొచ్చి పటిక వేసి నీటిని శుద్ధి చేసి పైపుల ద్వారా అన్ని గ్రామాలకు సరఫరా చేస్తుంటారు. 25 రోజుల కిందట నీటిని శుద్ధి చేసే పటిక అయిపోవడంతో తాగునీటి సరఫరా నిలిచి పోయింది. నీటిని శుద్ధి చేయకుండా సరఫరా చేస్తే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంటుంది. గత 25 రోజుల నుంచి ఇదిగో అదిగో అంటూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కాలక్షేపం

నీటి పథకం ట్యాంకు

చేస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. సుమారు ఒక లక్ష రూపాయలు ఖర్చు పెడితే వచ్చే వేసవి వరకూ పటిక సరిపోతుందని, ఐదు మండలాలలో ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు ఉండవని సత్యసాయి కార్మికులు చెబుతున్నారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. తమకు వేతనాలు ఇవ్వకపోయినా సత్యసాయి కార్మికులు నిరంతరం విధులు నిర్వహిస్తూ ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి ప్రజల తాగునీటి కష్టాలను తీర్చాలని కోరుతున్నారు. పురుషోత్తపట్నం సమీపంలో ఉన్న సత్యసాయి పంపింగ్ స్కీము వద్దకు నీటిని శుద్ధి చేసే పటికను తీసుకురావాల్సి ఉంది. స్థానిక నాయకులు ఈ విషయమై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని వారంతా కోరుతున్నారు. సత్యసాయి పథకాన్ని మూసివేసే పద్ధతిలో అధికారులు ఉన్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సత్యసాయి తాగునీటి పథకం ప్రధాన కేంద్రం

ప్రాజెక్టును పునరుద్ధరించాలి

మేము పోలవరంలో సర్వం కోల్పోయి ఇక్కడికి వచ్చాము. అక్కడ మంచి మాకు గోదావరి నీరు పుష్కలంగా ఉండేది. ఇక్కడికి వచ్చిన తర్వాత సత్యసాయి తాగునీటి పథకంపై ఆధారపడ్డాం. ఇప్పుడు తాగునీరు లేకపోవడంతో చాలా అనారోగ్యానికి గురవుతున్నాము. సంబంధిత అధికారులు స్పందించి ప్రాజెక్టును పునరుద్ధరించాలి.

- తాలూరి చిన్న ఎర్రమరెడ్డి

సత్యసాయి పథకాన్ని నిలిపేయాలనుకోవడం తగదు



సత్యసాయి మంచినీటి పథకాన్ని మూసి వేస్తారనే భయాందోళనలో మేమున్నాము. సంబంధించిన అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

- సుంకర పద్మారావు